నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | HYDERABAD

సీపీఆర్ చేసి.. ప్రాణం పోసి..

మెహిదీపట్నం, ఫిబ్రవరి 20: లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో విధులకు వెళ్తున్న సంతోష్ అనే కానిస్టేబుల్ ఫ్లోర్ మిల్ వద్ద గుండెపోటుతో కింద పడి పోయాడు. సమాచారం అందుకున్న లంగర్ హౌస్ పోలీసులు హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకున్నారు. లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నరేశ్ సీపీఆర్ అందించి ప్రాణాలను రక్షించారు. అనంతరం అక్కడి నుంచి సంతోష్‌ను ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా, సమయానికి సీపీఆర్ అందించడంతో ప్రాణాపాయం తప్పిందని డాక్టర్లు కానిస్టేబుల్ నరేశ్‌ను అభినందించారు.

సోమాజిగూడ డివిజన్‌లోని ఎంఎస్ మక్తా బ్లాక్ నం.43లో ఆరు రోజులు నీటి సరఫరా నిలిచిపోవడంతో బస్తీ ప్రజలు మాజీ కార్పొరేటర్లు లక్ష్మీనారాయణమ్మ, ఎస్ కె షరీఫ్ ను వెంట పెట్టుకొని జలమండలి కార్యాలయాన్ని వెళ్లారు. ఫిర్యాదులు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని మేనేజర్‌ను ప్రశ్నించారు. తాగునీటి ట్యాంకర్ పంపిస్తానని చెప్పడంతో మరింత ఆగ్రహానికి గురయ్యారు. ట్యాంకర్లు అవసరం లేదని, లోప్రెషర్ సరిచేసి, నీటి సరఫరా సమయాపాలనంగా వదలితే సరిపోతుందని బస్తీవాసులు స్పష్టం చేశారు.
-ఖైరతాబాద్, ఫిబ్రవరి 20

రద్దు మరిచి.. రాయితీలేంది?

ఎల్ ఆర్ఎస్‌పై కాంగ్రెస్ డబుల్ గేమ్

పూర్తి స్థాయిలో ఎల్ ఆర్ఎస్ రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ

తీరా గెలిచిన తర్వాత 25 శాతం రాయితీ అంటూ బుకాయింపు

స్పష్టమైన విధి విధానాలు ప్రకటించకుండా సీఎం రేవంత్ రెడ్డి దోబూచులాట

లక్షల్లో ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): 'అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తాం. పేద, మధ్య తరగతి వర్గాలకు ఉచితంగా లే అవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరిస్తాం.' అంటూ ఆనాడు ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలను కాంగ్రెస్ మరిచింది. అనధికారిక లే అవుట్లు, జీపీ లే అవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసి ఇబ్బంది పడుతున్న ఎంతో మందికి ఊరటనివ్వాల్సిన ప్రభుత్వం... జేబుకు చిల్లుపెట్టేందుకు సిద్ధమైంది. ఇచ్చిన హామీని పక్కన పెట్టి...ఫీజుల రూపంలో భారీ మొత్తంలో వసూలు చేయనున్నది. ఈ క్రమంలో హెచ్ఎండీఏతోపాటు, నగర శివారులో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో మొత్తంగా 7లక్షలకు పైగా ఉన్న పెండింగ్ దరఖాస్తులతో ఖజానా నింపుకొనే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. 2020 నుంచి కార్యాలయాల్లో మగ్గుతున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మార్చి 31 గడువులోగా ఫీజులు చెల్లించుకోవాలని, 25 శాతం రాయితీనిస్తున్నామని ప్రకటించి మరింత గందరగోళానికి కారణమైంది. దీనికితోడు అస్పష్టమైన విధివిధానాలను ప్రకటించిందే తప్పా... లిఖితపూర్వకంగా ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో గడిచిన ఐదారేళ్లుగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటానికి ప్రధాన కారణాల్లో ఇరిగేషన్, రెవెన్యూతోపాటు అనుమతులిచ్చే మున్సిపల్ శాఖల మధ్య సమన్వయ లోపం కూడా ఉంది. దీంతోనే ఇప్పటికీ లక్షలాది దరఖాస్తులను ఎప్పటిలోగా ఎలా పరిష్కరిస్తారనేది ఇప్పుడొక అంతు చిక్కని ప్రశ్నగా మారిపోయింది.

సుమారు 7 లక్షలకుపైగా దరఖాస్తులు

హెచ్ఎండీఏతోపాటు, శివారులోని మున్సిపాలిటీల్లో దాదాపు 7లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులను పలు దశల్లో పరిశీలించి క్రమబద్ధీకరించేలా గత ప్రభుత్వం విధివిధానాలు, ఫీజుల చెల్లింపులను ఖరారు చేసింది. కానీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చేందుకు ఎల్ ఆర్ఎస్ పేరిట కల్లబొల్లి మాటలు చెప్పిన రేవంత్‌రెడ్డి... అధికారంలోకి రాగానే... ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పేరిట పేదల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. దీనికోసం మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను 25శాతం రాయితీతో పరిష్కరిస్తామని తాజాగా ప్రకటించడం ఇప్పుడు గందరగోళానికి కారణమైంది.

జీవం పోసిందే కాంగ్రెస్..

గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న లే అవుట్లను అక్రమ ప్లాట్లుగా నిర్ధారిస్తూ, వాటిని క్రమబద్ధీకరించుకోవాలంటూ 2006లో తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంను ప్రవేశపెట్టింది. క్రమబద్ధీకరణ పేరిట ఖజానా నింపుకొనేందుకు అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మొదట ఎల్ ఆర్ఎస్ నోటిఫికేషన్ జారీ చేశారు. అప్పటివరకు సజావుగా నడిచిన జీపీ లే అవుట్ల రిజిస్ట్రేషన్, భవన నిర్మాణ అనుమతులతో స్థానిక సంస్థలకు కూడా ఆదాయం సమకూరించింది. కానీ ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ఖజానా నింపుకొనే కుట్రతో ఎల్ఆర్ఎస్ పేరిట సామాన్యుడిపై గుదిబండను కాంగ్రెస్ మోపింది. అయితే బీఆర్ఎస్ హయాంలోనూ ఎల్ఆర్ఎస్ నోటిఫికేషన్ జారీ చేసినా... క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులు, చార్జీలపై పలు రియల్ ఎస్టేట్ సంఘాల నుంచి వచ్చిన అభ్యంతరాలతో... ఎల్ఆర్ఎస్‌పై నిర్ణయం తీసుకోలేదు. కానీ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీ మరిచి, ఎల్ ఆర్ఎస్ పేరిట భారీ మొత్తంలో వసూలు చేసేందుకు కసరత్తు చేస్తోంది.

మాట మార్చిన రేవంత్ సర్కారు..

తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని, పేదోడిపై ఒక్క రూపాయి భారం మోపకుండానే ప్లాట్ల క్రమబద్ధీకరిస్తామని హామీ ఇస్తూ అప్పటి టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి కూడా పలు సమావేశాల్లో ప్రకటన చేశారు. కానీ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ విషయాన్ని మరిచిపోయి... ఎల్ఆర్ఎస్‌పై 25శాతం రాయితీ పేరిట రేవంత్ సర్కారు మాట మార్చింది. దీంతో పేదోడిపై సగటున లక్షల రూపాయల భారంపడనుంది.

అస్పష్టంగానే విధివిధానాలు..

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించే క్రమంలో.. ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన విధివిధానాలు విడుదల కాలేదు. గత నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేస్తారా? లేక కొత్త మార్కెట్ విలువ ప్రకారం ఫీజులను నిర్ధారిస్తారా? అనేది గందరగోళంగానే ఉంది. ప్రభుత్వం 25శాతం రాయితీ అని చెప్పి.. ఖజానాలో నింపుకొనే ప్రయత్నాలను ముమ్మరం చేసిందనేది వాస్తవం. నిజానికి హెచ్ఎండీఏతోపాటు, హైదరాబాద్‌తోపాటు, రంగారెడ్డి జిల్లాలో మూడు కార్పొరేషన్లు, మేడ్చల్ జిల్లా పరిధిలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లతోపాటు, ఈ రెండు జిల్లాల్లో కలిసి 23 మున్సిపాలిటీలలో 8లక్షల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

- శివారులోని ఓ మున్సిపల్ అధికారి

శివార్లలో చెక్‌పోస్టులు

సిటీలోకి అక్రమ ఇసుక రాకుండా పటిష్ట నిఘా

'గాయం ఒక చోట.. మందు మరోచోట' కథనంపై చర్చ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా వందలాది కిలోమీటర్ల దూరం నుంచి లారీలలో హైదరాబాద్‌లోకి అక్రమ ఇసుక ఎలా వస్తుంది...? దీనికి సహకరిస్తున్న వారెవరు..? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇసుక రీచ్‌ల నుంచే కట్టడి చేస్తే సమస్య ఉండదని 'గాయం ఒక చోట మందు మరోచోట' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనంపై పోలీసులు, వ్యాపార వర్గాలలో జోరుగా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయాలంటూ పోలీసులకు సూచనలు చేయడంతో నగరంలోకి అక్రమ ఇసుక లారీలు ప్రవేశించకుండా ఉండేలా చర్యలు తీసునేందుకు పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎక్కువగా గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక హైదరాబాద్‌కు సరఫరా అవుతున్నది. ఇక్కడ నకిలీ వే బిల్స్ పెట్టుకోవడం, ఒకచోటకు అనుమతి తీసుకొని మరోచోటకు తరలించడం, ఒకే వే బిల్‌తో పదుల సంఖ్యలో లారీలను తరలించడం వంటి జిమ్మిక్కులు చేస్తూ నగరానికి ఇసుక రవాణా చేస్తున్నరనే ఆరోపణలున్నాయి. ఇలాంటి ఇసుకను కొందరు చిరు వ్యాపారులు తెలిసి, మరికొందరు తెలియకుండా డంపింగ్ చేసుకుంటూ దానిని విడిగా చిన్న చిన్న నిర్మాణాలకు విక్రయిస్తున్నారు. ఇలాంటి వారిపై ఇప్పుడు ట్రై పోలీస్ కమిషనరేట్ల పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. వందల కిలోమీటర్ల దూరం అక్రమంగా ఇసుక రవాణా అవుతుందంటే అటూ ఆర్టీఏ, స్థానిక పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ విభాగాల అధికారులు ఏమి చేస్తున్నారనేది ఇప్పుడు అందరు ప్రశ్నిస్తున్న అంశం.

నిఘాను పటిష్టం చేస్తాం

- సుధీర్‌బాబు, సీపీ, రాచకొండ

ఇసుక తక్కువ ధరకు నేరుగా ప్రజలకు అందేలా ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. దళారులు చేతిలో పడుతూ ఇసుక బ్లాక్‌మార్కెట్‌కు తరలి వెళ్లకుండా కట్టడి చేయడంతో పాటు శివారులలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, అక్రమ ఇసుక నగరంలోకి ఎంట్రీ కాకుండా ఉండేలా నిఘాను పటిష్టం చేస్తాం.

తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకున్న సిరిపురం యాదయ్య సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

జగద్గిరిగుట్ట పరికి చెరువు వద్ద హైడ్రా కూల్చివేతలు.. వ్యక్తి నిరసన

పరికి చెరువులో హైడ్రా కూల్చివేతలు

జగద్గిరిగుట్ట ఫిబ్రవరి 20: పరికిచెరువు పరిధి లోని పలు ఆక్రమణలను హైడ్రా ఆధ్వర్యంలో గురువారం కూల్చివేశారు. భూదేవి హిల్స్ , మహదేవపురం , కూకట్ పల్లి పరిధి లోని భూముల్లోని 10 బేస్మెంట్లు, ఒక స్లాబ్ నిర్మాణాన్ని కూల్చివేశారు. జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్ప ఆల్విన్ కాలనీ మధ్య ఉన్న ప్రాంతంలో నిర్మాణాలపై చాలాకాలంగా వివాదాలున్నాయి. 60 ఎకరాలకు పైగా ఉన్న చెరువును 15 ఎకరాలకు కుంచించుకుపోయింది. ఈ నేపథ్యంలో గురువారం జగద్గిరిగుట్ట పోలీసులు రెవెన్యూ టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. హైడ్రా తొలగింపులు సాగుతుండగా రవి అనే వ్యక్తి తన బేస్మెంట్ కూల్చివేశారని యంత్రం వద్ద ఆందోళనకు దిగాడు. భూదేవి హిల్స్ విక్రయదారుడు బాలకృష్ణ ఏడాది కిందట తనకు రూ. 15 లక్షలకు ప్లాట్ విక్రయించాడని వాపోయాడు. జేసీబీకి అడ్డు పడి తన అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు అతన్ని పక్కకు తీసుకెళ్లి కూల్చివేత పనులు కొనసాగించారు.

పలు చోట్ల చిరు జల్లులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): పశ్చిమ బెంగాల్ నుంచి తెలంగాణ వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో గురువారం సాయంత్రం గ్రేటర్ వాతావరణం కొంత చల్లబడింది. అంతే కాకుండా నగరంలో అక్కడక్కడ చిరుజల్లులు పడ్డాయి. ఇదిలా ఉండగా పగలు మాత్రం ఎండలు దంచికొట్టాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 35.4, కనిష్ఠం 22.1 డిగ్రీలు, గాలిలో తేమ 52 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

ఆస్తుల స్వాధీనంపై స్పష్టత లేకుండానే ఆమోదం!

కేబీఆర్ పార్కు చుట్టూ ప్రాపర్టీల వివరాలు లేకుండా ఆర్‌డీపీ ప్లాన్‌కు ఓకే చెప్పిన స్టాండింగ్ కమిటీ

15 అంశాలు, ఆరు టేబుల్ అంశాలకు ఆమోదం

సిటీబ్యూరో: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 8వ స్టాండింగ్ కమిటీ సమావేశం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగింది. వివిధ రహదారుల విస్తరణ, మల్టీలెవల్ ఫ్లై ఓవర్ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ అనుమతికి కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ సమావేశంలో 15 అంశాలు, ఆరు టేబుల్ అంశాలకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు. ఇందులో ప్రధానంగా హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న ఫ్లై ఓవర్లు, రహదారుల విస్తరణకుగానూ 473 చోట్ల ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం తెలిపింది. కాగా కేబీఆర్ పార్కు చుట్టూ భూ సేకరణపై ఆర్‌డీపీ ప్లాన్‌ను ఆమోదం తెలిపిన కమిటీ....ఎవరెవరి ఆస్తులు స్వాధీనం చేసుకోవాల్సి వస్తుంది? ఎన్ని ప్రాపర్టీల సేకరణ చేస్తున్నారు? అనే అంశాలపై స్పష్టత లేకుండానే కమిటీ ఆమోదిస్తున్నట్లు మేయర్ ప్రకటించడం గమనార్హం. ఈ సందర్భంగా స్పోర్ట్స్, ఎస్టేట్ విభాగం అధికారుల లోపాలను ఎత్తిచూపుతూ పనితీరులో మార్పు రావాలని మేయర్ అడిషనల్ కమిషనర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమవేశంలో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి, స్టాండింగ్ కమిటీ సభ్యులు

పలు నిర్మాణాలు ఇవీ..

- హెచ్-సిటీ కింద కేబీఆర్ పార్కు క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద 30 మీటర్లు, 36, 66 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ, మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణాల కోసం 18 ఆస్తుల సేకరణకు ప్రభుత్వ అనుమతి కోసం కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపింది.
- హెచ్-సిటీ కేబీఆర్ పార్కు జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ జంక్షన్ వద్ద రోడ్డు విస్తరణ 36 మీటర్లు, 40.5, 45 మీటర్ల వెడల్పుతో మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి 47 ఆస్తుల సేకరణకు ప్రభుత్వ అనుమతి కోసం కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదించింది.
- హెచ్-సిటీ కింద కేబీఆర్ పార్కు ముగ్ధ జంక్షన్ వద్ద 30 మీటర్లు, 36 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ, మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణాల కోసం 40 ఆస్తుల సేకరణకు ప్రభుత్వ అనుమతి కోసం కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.
- శేరిలింగంపల్లి జోన్ యూసుఫ్ గూడ సర్కిల్ బోరబండ లోని స్లమ్ ఏరియా నిరుద్యోగ యువత, నిరుపేద మహిళలకు సీఎస్ఆర్ కింద లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ వారి సొంత నిధులతో సెంటర్ ఫర్ స్కిల్లింగ్ అండ్ లవ్లీ హుడ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణలు నిర్వహించేందుకు ఒక సంవత్సర కాలం పాటు బోరబండ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌ను స్వాధీనం చేసేందుకు అనుమతిస్తూ సంబంధిత ఏజెన్సీతో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఎంఓయూ చేసేందుకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు.
- బుద్ధ భవన్‌లో నాలుగో అంతస్తు ఏ బ్లాక్‌లో తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ లీజు వ్యవధి తదుపరి రెండు సంవత్సరాలు పొడిగింపునకు (19-07-2023 నుంచి 18-07-2025 వరకు) అలాగే అద్దె పెంపునకు కమిటీ ఆమోదం.
- ఆల్విన్ ఎక్స్ రోడ్ మియాపూర్ నుంచి హఫీజ్ పేట ఫ్లైఓవర్ వరకు ప్రతిపాదిత 24 మీటర్ల రోడ్డును 60 మీటర్ల విస్తరణకు 132 ఆస్తుల సేకరణకు కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ అనుమతికి సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.
- రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో భాగంగా రోడ్ నం.82 నుంచి ఫిల్మ్ నగర్ మీదుగా ఏబీఎన్ రోడ్డు వరకు 24 మీటర్ల రోడ్డు వెడల్పునకు 13 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం.
- హెచ్-సిటీ కింద ఐఐఐటీ జంక్షన్ వద్ద ప్రతిపాదిత మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రీవైజ్డ్ జంక్షన్ ఇంప్రూవ్ మెంట్ ప్లాన్ కోసం 65 మీటర్లు, 36 మీటర్ల రోడ్డు అభివృద్ధి 21 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం.
- జూబ్లీహిల్స్‌లోని బంజారా భవన్ నుంచి బంజారా చెరువు వరకు వరద నీటి కాలువ కమిషనర్‌ను ఆదేశించారు. క్రీడా ప్రాంగణాలపై సంబంధిత అధికారులు పూర్తి పర్యవేక్షణ చేసి జీహెచ్ఎంసీకి ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలని కోరారు. అత్యధికంగా ఆదాయం వస్తున్న క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించాలని మేయర్ తెలిపారు. జీహెచ్ఎంసీ అభివృద్ధికి ఈ సంవత్సర కాలంలో రూ. 700కోట్ల విడుదల చేసినందుకు కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి జోన్‌కు రూ. 25కోట్లు కేటాయిస్తా - కమిషనర్ ఇలంబర్తి

అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో ప్రజల కోసం పని చేయాలని కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ, జంక్షన్లు, పార్కులు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఆయా అభివృద్ధి పనులకుగానూ ప్రతి జోన్‌కు రూ. 25 కోట్ల నిధులు కేటాయించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

అపరిశుభ్రంగా హోటళ్లు

సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న ఫుడ్ ఎస్టాబ్లిష్ మెంట్ నిర్వాహకులపై ఫుడ్ సేఫ్టీ అధికారుల చర్యల పరంపర కొనసాగుతున్నది. విస్తృత తనిఖీల్లో భాగంగా గురువారం నగరంలోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. హైకోర్టు రోడ్డు సమీపంలోని మహాలక్ష్మి టిఫిన్ సెంటర్, భాటియా హోటల్ చిప్స్, హస్మత్ హాట్ చిప్స్, మర్వాడీ హాట్ చిప్స్, ఎంజీబీఎస్‌లోని శక్తి సాగర్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, మలక్‌పేటలోని అపేక్ష ఎంటర్ ప్రైజెస్, కృపా మార్కెట్, చాంద్రాయణ గుట్టలోని సిద్ధి వినాయక ఎంటర్ ప్రైజెస్, బాబానగర్‌లో బర్రిటో ఐస్ క్రీమ్, జూబ్లీహిల్స్‌లోని ఆర్‌కే ఎంటర్ ప్రైజెస్, కాప్రాలోని లక్ష్మీ డైరీ ప్రొడక్ట్స్, బ్రూవర్స్ కెటిల్, ఎంఎస్ హాస్టల్, మారుతీ హాస్టల్‌లలో అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల సమయంలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని లోపాలను గుర్తించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సిటీలో సీఎన్‌జీ కొరత

నగరంలో పూర్తిస్థాయిలో లేని సరఫరా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20: వాహనాల్లో నింపే కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధర దూకుడు మీదుంది. పెట్రోల్, డీజిల్ ధరల దరిదాపుల్లోకి ఇదీ చేరుతోంది. ప్రస్తుతం సీఎన్ జీ కిలో ధర రూ. 96కు చేరగా, ఆటో గ్యాస్ రూ.51.02కు చేరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 460 పైగా పెట్రోల్ బంకులు ఉండగా, అందులో 95 స్టేషన్లలో గ్యాస్ పంపులు అందుబాటులో ఉన్నాయి. మరో 35 కేంద్రాల్లో నేచురల్ గ్యాస్ కేంద్రాలు కొనసాగుతున్నాయి.

వాహనాలు 82 లక్షలపై మాటే

మహా నగరంలో వాహనాల సంఖ్య అక్షరాలా 82 లక్షలు దాటిపోయింది. అందులో సుమారు 14.35 లక్షల వరకు కార్లు ఉండగా, 1.46 లక్షల ఆటోరిక్షాలు, 80 వేల క్యాబ్ లు ఉన్నట్లు అధికార లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణంగా గ్యాస్ స్టేషన్లకు ప్రతిరోజు 5000 ఆటోలు, 1000 వరకు కార్లు తాకిడి ఉంటుంది. ఆటోల సీఎన్ జీ కిట్స్ సామర్థ్యం ఒక్కో స్టేషన్ కు ప్రతిరోజు 6 వేల కిలో వరకు గ్యాస్ డిమాండ్ ఉంటుంది.

అధిక మైలేజీ వల్లే డిమాండ్

పెట్రోల్, డీజిల్ కంటే సీఎన్ జీ, ఆటో గ్యాస్ తో నడిచే వాహనాలు మైలేజీ అధికంగా ఇస్తాయి. పెట్రోల్, డీజిల్ లీటర్ కు 15 నుంచి 20 కిలో మీటర్ల వరకు మైలేజీ ఇస్తే సీఎన్ జీ, ఆటో గ్యాస్, ఎల్పీజీ కిలో ఒక్కంటికి 22 నుంచి 28 కిలో మీటర్ల వరకు మైలేజీ వస్తుందని అంచనా. దీంతో వీటి ధర పెరిగినా డిమాండ్ ఏమ్రాతం తగ్గడంలేదు.